# గుప్పెడు ఆకాశం

రోజూలాగే ఎదురింట నాగన్నగారి కోడి కూత చెవిని పడింది. లేచి తలుపు తెరచి పెరట్లోకి వచ్చి గుండెనిండా చల్లని గాలి పీల్చుకున్నాడు - సుబ్బరామయ్య. వేపరెమ్మను వంచి ఒక పుల్లను తుంచి నోట నములుతూ తూర్పు దిశగా చూశాడు. ప్రశాంతంగా సాగిపోతున్న తన బతుకులో ఇటీవల వచ్చిపడ్డ అశాంతిని తాత్కాలికంగా పక్కకు నెట్టి ఉషోదయం విరజిమ్ముతున్న పసుపు కుంకుమసిరుల్ని నిరామయంగా కంటితో ఏరుకుంటూ వేపచెట్టు కింది రాతి చప్టామీద కూర్చున్నాడు.

ఇంతలో వీధి గుమ్మంలోంచి సైకిల్ గంట వినిపించింది. "ఎంత అదృష్టవంతుడివి రాజా! నీకోసం వేకువనే ఎన్ని ప్రాణాలు ఎదురు చూస్తూవుంటాయో తెలుసా?" అని పలకరిస్తూ పాలపేకెట్‌నూ వెనువెంటనే వాకిట్లో పడిన వార్తా పత్రికనూ అందుకున్నాడు. ప్రతీ ఉదయం ఇలానే ప్రారంభమౌతుంది.

"ఈ కాళ్ళ నొప్పులు తగ్గే మందు లేదు. ఈ ఇంటి చాకిరీకి అంతూ లేదు. ఆచెట్లు రాలుస్తున్న ఆకుల్ని ఊడ్చి పెరడంతా అద్దంలా ఉంచవే అంటే ఆ పనిమనిషి వినదు. పిల్లల్ని సాకి పెద్దచేసి పంపించాక ఈ ఇల్లాలు ఎక్కడ సుఖపడి పోతుందో అని ఈ కొంపా ఈ పెరడూ నా చేత ఊడిగం చేయించుకుంటున్నాయి" అని తనస్వగతాన్ని ఎంతో ప్రకాశంగానే వినిపిస్తూనే వుంటుంది నాగరత్తమ్మ. వంటింటి కిటికీ లోంచి వచ్చే శబ్దతరంగాలు జోరీగల్లై రొదచేస్తాయి.

"ఈ కొంపని . అమ్మిపారేసి చిన్న ఫ్లాట్ ఊరిమధ్య కొనమంటే వినరాయె. ఆ కమలమ్మగారున్న ఫ్లాట్ చూస్తే ఎంత ముచ్చటేసిందో కదా. రెండుగదులైతేనేం. అద్దంలా ఉన్నాయి. అదేదో పంచవటీ అపార్ట్‌మెంటట, అందులో ఒక ఫ్లాట్ అమ్మకానికొచ్చిందంటే ఒకంతట వినలేదు. కొవాలా వద్దా అని తాత్సారం చేసేసరికి ఆ పుణ్యకాలం కాస్తా దాటిపోయింది. నామాట అసలు ఎన్నడూ చెవిన పెట్టందే! ఆ ఎదురింటి వాళ్ళకేం. ఇంకా చిన్నవాళ్ళు. వయసూ ఓపికా ఉన్నవాళ్ళు. ఏదో అంటారు. ఈ కొంపా ఈ పెరడూ చూసుకుంటూ కూర్చేవాలా!" అని

కష్టిస్తుంది.

ముప్పై ఏళ్ళకు పైగానే ఉద్యోగం వెలగబెట్టావు. ఇక విశ్రాంతి తీసుకో - అని కడుపునకు తిండిపెట్టిన కార్యాలయం ఇంటికి పొమ్మనే దాకా ఉదయం లేచిన దగ్గరనుంచీ ఉరుకులు పరుగులుగానే సుబ్బరామయ్య జీవితం గడచింది. ఆ హడావిడిలో ఇలాంటి చురకలు అంతగా బాధించేవి కాదు. పింఛను తీసుకుంటున్న నాటినుంచీ ఈ కష్టింపులూ స్వగతాలూ ఎంత విదిలించుకుందామనుకున్నా ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. అయితే తన బతుకులోనూ భార్య ఆలోచనల్లోనూ వచ్చి పడుతున్న మార్పులు మాత్రం ఎంతో ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నాయి.

"పిల్లలవాళ్లం, అప్పో సప్పోచేసి ఒక ఇల్లు కట్టుకోకపోతే నానా అవస్థపడిపోతాం. బోలెడు అద్దెలు కట్టుకుంటూ, అద్దెలు పెరిగినప్పుడల్లా ఇళ్లు మార్చుకుంటూ తిరగాలి" అని గతంలో పోరుతూ జాగాకొని ఇల్లు కట్టుకున్న దాకా నిద్రపోని భార్య ఇప్పుడు ఈ ఇల్లు తనకేమీ కానట్టూ గొంగళి పురుగును చూసినట్టూ ఏవగించుకుని అమ్మిపారెయ్యమని పదేపదే అనడం చాలా వింతగా తోస్తుంది. సెలవులన్నీ ఖర్చుపెట్టుకుని ఎండలో నిలబడి ఇల్లు కట్టించుకున్న రోజులు గుర్తుకొస్తాయి. అంతకు పూర్వం అద్దె చెల్లిస్తూ పరాయి ఇళ్లలో పడ్డ న్యూనత కూడా జ్ఞాపకం వస్తుంది.

అరచేతిని అప్రయత్నంగా తలమీద పెట్టుకున్నాడు. ఇది వరలో చేతికి రెల్లుతుప్పలా పెరిగిన తల తగిల్తే అయ్యబాబోయ్ అప్పుడే పెరిగిపోయిందీ ? పనులన్నీ మానుకుని ఆ తలమాసిన వాళ్ళ వరసలో కూర్చుని క్షౌరం కోసం పడిగాపులు పడాలి అనుకునే వాడు. ఇటీవల చెయ్యి తలమీద పడితే నున్నటి కపాలాన్ని ముట్టుకున్నట్టు అనిపిస్తోంది. వేపుళ్ల నమిలినప్పుడు కూడా ఇలాంటి ఆలోచన వస్తోంది. దంతాలు వాటి స్థానంలో ఉన్నప్పుడు వేపుళ్లలను కుంచెలా నమలడానికి ఒక్కనిమిషంకూడా పట్టేదికాదు. శైశవం నుంచీ ఎంతో ప్రేమగా పెట్టుకున్న అలంకారాలన్నిట్నీ ప్రకృతి తిరిగి ఒక్కొక్కటే తీసుకుంటుందన్న ఆలోచన రాగానే తాత్త్వికంగా నవ్వుకున్నాడు.

అందంగా కనిపించే అపార్టుమెంట్లలో నివాసాలు గాలివెలుగూ పారని పావురాల గూళ్ళని చెప్పి చూశాడు. ఆకర్షించడంలో సాలెగూళ్ళకవి ఏమాత్రం తీసిపోవు కానీ, కీటకాల్లాగ అందులో చిక్కుకున్న తరవాత వాటి అసలు స్వరూపం అర్థమయ్యేది. అని కూడా హెచ్చరించాడు. డబ్బుపోసి

కొనుక్కున్న సొంత ఆస్తి అని మురిసిపోయినా ఎన్నో రూపాల్లో అద్దెను సొంత ఆస్తిలోనే వుంటూ చెల్లించుకోవలసి వస్తుందనీ, ఆటో చార్జీల్లాగ ఆ అద్దె పెరుగుతూ పోతుందనీ వివరంగా చెప్పాలని ప్రయత్నించాడు. కానీ ప్రతీమాటకూ అర్ధాంగి అడ్డువచ్చింది. అదెవరో కమలమ్మ ఎంత నిశ్చింతగా ఉందో చూడమంది. ఊరందరిదీ ఒక దారైతే మీదొక దారి అంది. ఇక అనుభవంతోనే తప్ప అర్థంకాని విషయాలను ఉపన్యాసంతో ఊదరగొట్టి ప్రయోజనం ఉండదని నిశ్చయించుకున్నాక - ఇల్లు అమ్మకానికి పెట్టాడు.

చెట్టూ చేమా పెరడూవున్న ఇల్లు పాతదైనా వేడివేడిగా వేయించి తీసిన మిరపకాయ బజ్జీలా అమ్ముడయిపోయింది. కానీ ఆ వచ్చిన పైకం మీద అదనంగా పడకుండా ఫ్లాటు కొనుక్కోవాలంటే మాత్రం కోరుకున్న సదుపాయాలతో కోరిన చోట దొరకడం కష్టమే అయింది. వసతిగా ఉందనుకుంటే మూడో అంతస్తులో ఉండేది. అంతస్తు వద్దనుకుంటే ధర ఎక్కువ. నేల విడిచి తొలి అంతస్తులో ఉన్న ఒక నివాసం గోచీకి పెద్దదిగానూ గుండారుకి చిన్నదిగానూ అన్నట్లు పరిమితంగానే ఉన్నా భార్య సరే అన్నకారణంగా కొనుక్కుని ఇక ప్రశాంతంగా ఉండొచ్చుననుకున్నాడు. ఒక పని అయిపోయింది బాబూ! అని సుబ్బరామయ్య నిట్టూర్చి ఇద్దరి మధ్యా చాలా కాలంగా నలుగుతున్న వివాదం ముగిసి తన కోర్కె సాధించుకో గలిగినందుకు నాగరత్తమ్మ కూడా తృప్తి పడింది. మంచిరోజున పాలు పొంగించి గూటిలో చేరడం అంత కష్టం కాలేదు.

పచ్చదనం కరవైపోయిన ఆ జనారణ్యంలో సుబ్బరామయ్య పంజరంలో పెట్టినట్టు ఉక్కిరిబిక్కిరైపోయాడు. మరునాటి ఉదయం ద్వారానికి ముందున్న సన్నని వరండాలోనే ఆ గోడనించి ఈ గోడ దాకా బోన్లో సింహంలా పచార్లుచేసి తన నివాసంలోకి వచ్చేశాడు. చీకటి ఇంకా చెదరక పోవడంతో లైటు వేసుకుని ఏదో పాతపుస్తకం అందుకుని కుర్చీలో కూర్చున్నాడు.

సిసింద్రీలాంటి అమ్మాయి తలంటిపోసుకుని తడిసిన కురులు ఆరబెట్టుకుంటూ వచ్చింది. చేతిలో తళతళ మెరిసే పెద్దస్టీలు పాత్రతో, తలుపును మోకాలితో తోసుకుంటూ వచ్చి "గుడ్‌మాణింగ్ తాతగారూ!" అని అతణ్ణి తప్పించుకుంటూ లోనికి వెళ్లింది. భార్యతో ఏదో మాటలాడి తిరిగి అదే గెన్నెతో వచ్చిన దారినే పోయింది.

'తాతగారూ' అన్న సంబోధనకు ఉలికిపడ్డాడు. ఎక్కడో అస్సాంలో ఉయ్యాలూగుతున్న తన చంటి మనవరాలు ఇంకా నోట్లో వేలు పెట్టుకునే దశలోనే ఉంది. గుడ్‌మాణింగ్ తాతా!

అని పిలవడానికి కొంత వ్యవధిపడుతుంది అలవాటు పడని సంబోధనకు తేరుకుని ఆ అమ్మాయి వెళ్ళిపోతున్న దిశగా చూశాడు. ముక్కుమీదకు జారిపడుతున్న కళ్లద్దాలను మునివేళ్లతో ఎగదోసుకుంటూ "ఎవరీ అమ్మాయి ఉదయాన్నే ఏదో తెచ్చినట్లుంది ?" అని భార్య నడిగాడు .భార్య దగ్గరనుంచి సమాధానం రాలేదు. వినిపించలేదేమో అని ఇంకో మారు ప్రయత్నించాడు.

"మీకు ఇష్టమని పక్కఫ్లాటు వాళ్ళ అమ్మాయి జంతికలు తెచ్చింది." వంటింట్లోంచి తన ప్రశ్నకు కాస్త ఆలస్యంగా జవాబు వచ్చింది. తనకు దంతాలు లేవని భార్య ఎగతాళి చేస్తున్నట్లు అర్థం చేసుకోగలిగాడు. పనిలో ఉన్న భార్యను అనవసరంగా ఏదో ప్రశ్నతో కదిపినందుకు నొచ్చుకున్నాడు

"ఆ తెచ్చిన పాలగిన్నె మన ఫ్రిజ్‌లో పెట్టుకోవాలని వచ్చింది ఆ పిల్ల . ఇదివరకు ఈ ఫ్లాట్‌లో ఉండి మనకమ్మినవాళ్ళ ఫ్రిజ్‌లో – ఎండాకాలంలో పాలూ, నీళ్ళూ పెట్టుకునే అలవాటు వున్నట్టుంది. మనకి ఫ్రిజ్‌లేనే లేదన్న విషయం తెలిసి నిరుత్సాహంగా వెళ్ళిపోయింది." అంటూ ఉన్న నిజాన్ని వేడికాఫీతో పాటూ నిదానంగా అందెంచింది నాగరత్తమ్మ.

కొమ్మల్లో వాలె చిలుకల్నీ కువకువలాడే గువ్వల్నీ ఎండుపీచు ఉండకట్టి నోటపెట్టుకుని అవలీలగా పరుగులు తీసే ఉడుతల్నీ చూస్తూ వేపచెట్టు కింద పొద్దుపుచ్చే రోజులుపోయి బరువుగా కాలాన్ని నెట్టుకుంటూ గడపవలసి వచ్చినందుకు బాధ పడ్డాడు.

ఆ సాయంత్రం మేడమెట్లు ఎక్కుతూ ఉంటే "అంకుల్! అంకుల్! ఆ ఇరవై రెండో నెంబరు ఫ్లాటులోకి కొత్తగా వచ్చిన వారు మీరేనా ?" అని పలుకరించాడో యువకుడు. ఒక చెవికి పోగుపెట్టుకున్నాడు. నాటకాల్లో పౌరాణిక పాత్రవేసే వాడిలా జులపాలు పెంచుకుని వెనక్కు దువ్వి ముడివేసుకున్నాడు. " ఈ ఆదివారం ఉదయం మన విశ్రాంతి అపార్ట్‌మెంట్లోని వాళ్ళమంతా సమావేశమౌతున్నాం. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కి జీతం పెంచాలట. ఇంకా కొన్ని పెరిగిన ఖర్చుల గురించీ చర్చించాలి. మీలాంటివారి అనుభవం – అభిప్రాయం మాకు చాలా అవసరం" అని మెట్ల మీదనే నిలబెట్టి అర్థగంట ఊదరగొట్టేశాడు. అలాగే బా బూ! అని వాణ్ణి వదిలించుకుని వచ్చి, తన నివాసానికి చేరుకుని బతుకు జీవుడా అనుకున్నాడు.

పరిమితంగా ఉన్న జాగాలోనే మోకాళ్లకు దెబ్బతాకకుండా తిరిగే వీలుగా కుర్చీలు, బల్లలు, మంచం, పెట్టెలు సర్దుతూ అటూ ఇటూ మారుస్తూ కొత్తగా దొరికిన ఆట బొమ్మతో పసివాడు ఆడుకున్నట్టు రెండు రోజులపాటు తీరికలేకుండా కాలక్షేపం చెయ్యగలిగింది

నాగరత్నమ్మ. వరండాలో కాసింత సేపు తిరిగింది. చివరి ఫ్లాటులో ఉన్న పోనీటైల్ అమ్మడు చంకలోని పసివాణ్ణి చూసి, ముచ్చటపడింది. బుగ్గమీద చిటికిన వేలతో సున్నితంగా తాకింది "బామ్మగారూ! పది నిముషాలు వీణ్ణి పట్టుకుంటే -నేపోయి మా పెద్దవాణ్ణి స్కూల్లో విడిచి వచ్చేస్తాను." అని పసివాణ్ణి చేతికిచ్చి వెళ్ళింది. "పిల్లాడు బావున్నాడు. పది నెలలుండొచ్చు నా మనవరాలు ఇంతకన్నా రెండు నెలలు పెద్దదై ఉంటుంది. ఏం చేస్తోందో "- అని ఊహించుకుంటూ వాడితో ఊసులాడుతూ గడిపింది. కిందికి దింపమని చేతిలోంచి జారిపోతున్నాడు. దింపితే చాలు బొంగరం లాగా ఇల్లంతా పారాడి చేతికందిన వస్తువులు లాగి కిందకి పడేస్తున్నాడు. పసిపిల్లలతో ఎక్కువగా గడిపే అలవాటు చాలాకాలంగా తప్పిపోయింది. వాడేమో సహనానికి పరీక్ష పెట్టేలా ఆటలు మొదలెట్టాడు. అసలే మోకాళ్ళ నొప్పులు. పిల్లల్ని పెంచిన రోజులు తలచుకుని ఆ సహనం, ఓపికా ఎక్కడికి పోయాయా అని వాపోయింది. భార్యపడుతున్న అవస్థ చూస్తూ, ఊరుకోలేక సుబ్బరామయ్య కొంతసేపు పిల్లవాణ్ణి ఎత్తుకుని అవీ ఇవీ చూపించి, లాలించాడు. ముక్కుమీదికి జారిపడుతున్న కళ్ళద్దాలు చేతిలోకి దుడుకుగా తీసుకుని చంటివాడు గిరాటువేస్తే అవిపోయి మంచంమీద పడ్డాయి కాబట్టి సరిపోయింది. లేకుంటే వాటికి నూరేళ్ళూ నిండేవే. ఇక పిల్లవాడి ఆటలు ముగిసి ఏడుపు ప్రారంభమైంది.

"గంట దాటినా వీడి తల్లి రానే లేదు. ఇదు పది నిముషాల్లో వస్తానంది. ఈ సరికి వచ్చిందేమో చూసి, ఇచ్చివస్తాను. ఇలా ఇవ్వండి" అని పిల్లవాణ్ణి తీసుకుని బయట వరండాలోకి వెళ్ళింది నాగరత్నమ్మ. ఇంకా చివరి ఫ్లాటు తాళం వేసే ఉంది. దూరాన ఎనిమిదేళ్ళ అమ్మాయి కనిపిస్తే పిలిచి "ఇదిగో పాపా! ఇలారా ఈ పిల్లాడి తల్లి వచ్చిందేమో కిందికెళ్ళి చూసి రావూ?" అని ప్రాధేయపడింది.

"నేనిప్పుడు కిందనించే వచ్చాను బామ్మగారూ! ఆంటీ మెట్లదగ్గిర వాచ్‌మెన్‌తో ఏదో మాట్లాడుతోంది" అని ఆ పాప చెప్పగానే పోయిన ప్రాణం లేచివచ్చినట్లయింది. వెళ్ళి పిల్లవాణ్ణి అప్పగించి వచ్చేసింది. కొంతవరకూ నాగరత్నమ్మ మనస్సు కూడా ఇప్పుడు పసివాళ్ళ మనసులాగే ఉంది. పసిపిల్లలకు కలిగిన అసౌకర్యమేమిటో స్పష్టంగా వాళ్ళకే అర్థంకాదు. అర్థమైనా సరిగ్గా చెప్పుకోగల భాష రాదు. మార్పు కోసం పోయి గోష్పాదమంత బాల్కనీలో నిలబడింది. ఇంకా సిమెంటు పూత పూర్తికాని ఇటుకల గోడ తన కళ్ళముందు తెరవేసినట్టు కనిపించింది. బాల్కనీ ఎత్తుకు మించిపోయి ఉన్న ఆ గోడ కొత్తగా పక్కనే మొలుచుకొస్తున్న ఇంకో అపార్ట్‌మెంట్‌ది.

నీలి ఆకాశాన్ని చూసి ఎన్నాళ్లో అయిపోయినట్టు తోచింది. కింద గేటుదాకా వెళ్ళాలన్నా మెట్లు దిగాల్సిందే నిస్త్రాణంగా గదిలో మంచం మీద వాలింది. ఈ ముసలివాళ్లకేం కావాలి అని అడిగే వాళ్ళకన్నా వీళ్ళు మన కెలా ఉపయోగపడతారు - అని ఆలోచించే వాళ్లే ఇక్కడ ఎక్కువగా ఉన్నారేమో అన్న అభిప్రాయం మెదలగానే ఎక్కడలేని నీరసం వచ్చేసింది.

ఆ రాత్రి నాగరత్తమ్మ నిద్రలోకి జారుకున్నా సుబ్బరామయ్య మేలుకునే ఉన్నాడు. "పిల్లల దగ్గరనుంచి ఉత్తరం వచ్చి చాలా రోజులైంది. రేపు పోస్టాఫీసు కెళ్ళి ఉత్తరాలు రాసి పడెయ్యాలి" అనుకున్నాడు. వెనుక గోడకి మీదుగా ఉన్న చిన్న వెంటిలేటర్ లోంచి ఎవరిదో బుల్లితెర నేనింకా నిద్రపోలేదంటూ రొదచేస్తోంది. వేకువనే లేచి, వార్తా పత్రికలు తెచ్చి వేసే కుర్రాణ్ణి పట్టుకుని మా క్కూడా రోజూ పత్రిక వెయ్యమని చెప్పాలి - అనుకుంటూ నిద్రలోకి ఒదిగిపోయాడు.

కోడికూత వినబడే పరిసరాలూ, అవకాశము అక్కడలేకపోయినా వరండాలో ఎవరిదో గొంతు వినవచ్చినట్లనిపించి వేకువనే తలుపుతీసి బయటకు చూశాడు. కాసింత దూరాన ఎదుటి వరసలో తలుపు దగ్గర నిల్చున్న వాడెవడో - వార్తా పత్రిక లోకి తలను దూర్చేశాడు. ఒక చేత్తో చంటివాణ్ణి ఎత్తుకుని రెండోచేత్తో పత్రిక పుటల్ని తిప్పుతూ పరీక్ష హాల్లోకి పోయే విద్యార్థి ఆఖరిసారిగా నోట్సు తిరగవేస్తున్నట్లు హడావిడి పడిపోతున్నాడు.

"ఆస్తికోసం తండ్రిని చంపిన తనయుడు- ఘోరం, పదేళ్ళ బాలికపై అత్యాచారం- ఎంత ఘోరం ! యోగినని మోసంచేసిన భోగి గుట్టు రట్టు - స్వప్నలోకం అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్లు కొన్న వాళ్ళకి తమతమ హక్కులు నిరూపించుకోవలసిందిగా నోటీసులు జారీ - అమ్మో అని జీరగొంతుతో పైకి వినబడేలా వార్తలు చదువుతూ దళసరి కళ్లద్దాలు సవరించుకుంటున్నాడు. చంటివాడు మాత్రం క్షణం నిలవనియ్యకుండా వార్తా పత్రిక చదువులో దీక్షాభంగం చేస్తూ ఉన్నాడు.

సుబ్బరామయ్యకు ఎందుచేతనో కానీ అడుగుముందుకు పడలేదు. ఆటలో దెబ్బ తగిలి కూర్చుండి పోవాల్సి వచ్చిన క్రీడాకారుడిలా వెనుక్కువచ్చి తలుపును దగ్గరగా చేరవేసుకుని కుర్చీలో కూర్చుండి పోయాడు. వంటింట్లోకి వెళ్ళబోతున్న నాగరత్తమ్మ, చిన్నపిల్లాడిలాగ గుడ్లుమిటకరిస్తూ కూర్చున్న భర్తను చూడగానే ఎందుకనో బోలెడు జాలి ముంచుకొచ్చింది. చేతిలో వార్తా పత్రిక లేదు. ఇంకా వేడి కాఫీ కప్పు చేతిలోకి రాలేదు. "మీకు చెప్పడం మరిచాను. నిన్ననే పేపరు వేసే కుర్రాడు కనిపిస్తే - మనకి రేపటినించీ వెయ్యమని చెప్పాను. ఉదయాన్నే వార్తాపత్రిక చేతిలో పడితే కాఫీ కోసం అప్పుల వాడిలా వంటింటి వేపు చూడరని

నాకు తెలుసు కదా. ఈ పాటికి వేసే ఉంటాడు. పోయి చూడండి. ఇంతలో నే కాఫీ కాచి తెస్తాను" అంది మృదువుగా.

"మరి ఆమాట నా చెవినవేస్తే కదా" అంటూ ఉత్సాహంగా సుబ్బరామయ్య కుర్చీలోంచి లేవబోతూవుంటే తలుపు సగం తెరచుకుంది. దళసరి కళ్లద్దాల శాస్త్రి అందులోంచి తలదూర్చాడు. "మా చంటి వెధవాయ్ మొదటి పేజీని కాసింత చించేశాడు. అంకుల్ ఏమీ అనుకోకండి. ఉపాధ్యాయుడి మీద చెయ్యి చేసుకున్న విద్యార్థిట – ఎంత ఘోరం. ఆ వార్త చదవండి" అని దినపత్రికను అందించాడు.

"అవును ఇదీ ఘోరమే" అనుకుంటూ పత్రికను అందుకున్నాడు. కానీ దృష్టి పత్రిక మీద నిలవలేదు. ఇక్కడ తారసపడ్డ వాళ్ళంతా ఒకే మూసలో పోసినట్లు ఉన్నారేమో అనిపించింది. ఈ గోడల మధ్య బతుకుతున్నవాడెవడూ ఆ మూసలో పడక తప్పించుకోవడం సాధ్యం కాదేమో. తనూ వాళ్ళలో ఒకడుగా మారిపోతాడేమో అన్న ఆలోచనన కూడా వెను వెంటనే సుబ్బరామయ్య మనసులో మెదిలింది. వెలుగు సోకని మొక్కలు పాలిపోక నవనవలాడుతాయా ? అనుకున్నాడు.

వేడి కాఫీ కప్పుతో ఎదురుగా వచ్చి నిలుచున్న నాగరత్తమ్మ 'మన ఇంటిని అదే ధరకు తిరిగి ఇస్తారా ? అని అడగాలనుకుంది. కానీ ఆ ప్రశ్న తనకే అర్థం లేనిదిగా తోచి ఊరుకుండిపోయింది. వార్తా పత్రికను చదువుతూ కాఫీని రుచిచూస్తూ భర్త నెమ్మదిగా తన లోకంలో తానున్నాడు. ఇద్దారి మధ్యా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. అలాంటి బరువైన నిశ్శబ్దంలోకి తలుపును తోసుకుంటూ నాగన్నా అతని భార్య సీతాలూ రావడంతో – దారితప్పిన స్నేహం వెతుక్కుంటూ వచ్చి తలుపు తట్టినంతగా సంబరపడిపోయింది నాగరత్తమ్మ.

"రండి రండి మా ఇంటిని సులభంగానే కనుక్కున్నారే" అని ఆహ్వానించింది.

"మేం అనుకోకుండా ఇలా వచ్చాం. మా బంధువుల అమ్మాయి పెళ్లి ఉదయం ఎదురుగా కంటికి కనపడింది. ఒకమారు ఎలా ఉన్నారో చూసి పోదామని తోచింది." సీతాలు వివరించింది.

"మా ఇల్లెలా ఉంది ?" ఆత్రంగా అడిగింది నాగరత్తమ్మ "బాగుండకేం ? కోరి కొనుక్కున్నదేగదా !" సీతాలు నిరామయంగా జవాబిచ్చింది.

"నేనడిగింది ఈ ఫ్లాట్ గురించి కాదు మా పాత ఇల్లు...."

"ఇంకా మన ఇల్లేమిటి. మన చెయ్యి దాటి పోయాక ...." అంటూ మధ్యలో కలగజేసుకున్నాడు సుబ్బరామయ్య. సీతాలు అప్పుడు అర్థం చేసుకుంది.

"మీ పెరట్లో చెట్లు కొట్టించేశారు. మీ వెనకవాళ్ళ జాగా కూడా కొనుక్కున్నారట. అక్కడంతా కలిపి మూడంతస్తుల అపార్ట్‌మెంట్‌కి ప్లాను వేశారుట, ఇవాళ ఉదయమే అక్కడ ముగ్గుపోస్తున్న పనివాళ్ళు అనుకుంటున్నారు."

సీతాలు చెప్తున్నమాటల్ని నిర్వికారంగా వింటున్న సుబ్బరామయ్యకు ఆశ్చర్యం ఏమాత్రం కలగలేదు. కానీ నాగరత్తమ్మను చెప్పలేని నిరుత్సాహం ఆవహించింది.

- ఈనాడు ఆదివారం **24** జనవరి, **1999**